


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కర్నూలు నంద్యాల
మంగళవారం | 20 మే 2025
పేజీలు 8


# ఘోర రోడ్డు ప్రమాదం



- ముగ్గురు అక్కడికక్కడే మృతి..
- మరో ముగ్గురికి స్వల్పగాయాలు
- మృత్యువడిలోనూ విడదీయలేని స్నేహ బంధం
- కుక్కను తప్పించబోయి బోల్తాపడిన కారు
- ఘటనలో ముగ్గురు కర్ణాటక వాసులు మృతి

ప్రమాదంలో మృతి చెందిన స్నేహితులు



ప్రమాదంలో పొలాల్లోకి దూసుకెళ్ళిన కారు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:** వేసవికాలంలో సెలవుల సందర్భంగా కర్ణాటక రాష్ట్రంలోని తుంకూరు జిల్లాకు చెందిన ఆరుగురు స్నేహితులు కారులో సరదాగా కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రాలైన మంత్రాలయం, శ్రీశైలం క్షేత్రాలను సందర్శించి, స్వామి వార్ల దర్శనం చేసుకొని తీరా వారు ఇంటికి తిరుగు ప్రయాణంలో కుక్క రూపంలో వారి మృత్యువు ఎదురుపడింది. దీంతో ఆరుగురు స్నేహితుల్లో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా,మరో ముగ్గురు స్వల్పగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఇక వివరాలలోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రంలోని తూంకూరు జిల్లాకు చెందిన సంతోష్, నవీన్, లోకేష్, దర్శన్, శశిధర్, శివానంద్ లు ప్రాణ స్నేహితులు కెఎ02ఎంకె4525 నెంబర్ గల కారులో ఆంధ్రప్రదేశ్‌లోని మంత్రాలయం,

మిగతా 2లో

## పారిశుధ్ధ్య పనులను
# ముమ్మరం చేయండి



సమావేశంలో పారిశుధ్ధ్య పర్యవేక్షక సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న మంత్రి టిజి.భరత్

- పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత వారిదే బాధ్యత
- గార్బేజ్ పాయింట్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి..
- ప్రభుత్వ ఆస్తులపై బ్యానర్లు, పోస్టర్లు అతికిస్తే చర్యలు తీసుకోండి
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** నగరంలో పారిశుధ్ధ్య పనులను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పారిశుధ్ధ్య పర్యవేక్షక సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ యస్.రవీంద్ర బాబు తో కలిసి పారిశుధ్ధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు, మేస్త్రిలతో పారిశుధ్ధ్యంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలో పారిశుధ్ధ్యంపై ఫిర్యాదులు ఎక్కువ అయ్యాయని, వాటిపై పర్యవేక్షక సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పునరావృతం అవుతున్న సమస్యలు ఫిర్యాదులు వచ్చేంత వరకు వేచి ఉండకుండా, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో పారిశుధ్ధ్యం మెరుగుపడకపోతే, ఎక్కడైనా పారిశుధ్ధ్యం

మిగతా 2లో

# అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

- సకాలంలో పనులు పూర్తి చేయండి
- నాణ్యత ప్రమాణాల్లో రాజీపడేది లేదు
- మున్సిపల్ కౌన్సిల్ హాల్లో అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశంలో మంత్రి టి.జి భరత్

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** కర్నూలు నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లనురాష్ట్రపరిశ్రమలశాఖ మంత్రి టి.జి భరత్ ఆదేశించారు. నగరంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ అధికారులు,కాంట్రాక్టర్లతో ఆయన సోమవారం సమావేశం

మిగతా 2లో

# అర్జీల పరిష్కారం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



2లో

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

## ఒక్కటవుదాం..కడప మహానాడును
# విజయవంతం చేద్దాం



6లో

ఒక్కటై మహానాడును విజయవంతం చేద్దాం అంటున్న నేతలు

# టీడీపీ కార్యకర్తలే నా ప్రాణం

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి
- కార్యకర్తల కోసం ప్రాణాలైన అర్పించేందుకు సిద్ధం..
- నా కుటుంబ సభ్యుల కంటే కార్యకర్తలకే ప్రాధాన్యత
- కోవెలకుంట్ల మినీ మహానాడులో మంత్రి బిసి ఉద్రేక ప్రసంగం
- కడపలో జరిగే మహానాడులో అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మంత్రి బిసి పిలుపు



కోవెలకుంట్ల మినీ మహానాడులో ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి పార్టీని మరింత ముందుకు తీసుకుపోవాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం కోవెలకుంట్లలోని ఓ ఫంక్షన్ హాల్ లో

మిగతా 2లో

# పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

లోపిస్తే సంబంధిత సిబ్బందే బాధ్యత వహించాలని,వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పారిశుద్ధ్యంలో విశాఖ పట్నం తరహాలో నగరాన్ని తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గార్బేజ్ పాయింట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని, రహదారులపై చెత్తా వేసే వారిని గుర్తించి హెచ్చరించాలని, అయినప్పటికీ వినకపోతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారులు, కూడళ్లపై బ్యానర్లు, పోస్టర్లు అతికించే వారిపై సైతం చర్యలు తీసుకునేందుకు ఉపేక్షించొద్దని ఆదేశించారు. సిసి కెమెరాలకు అడ్డంగా ఏవైనా బ్యానర్లు కడితే ఆ సమయంలో అక్కడ ఏదైనా ప్రమాదం జరిగితే బ్యానర్లు కట్టిన వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, మురుగు కాలువలపై ఆక్రమణలు, కాలువలు ఎక్కుతక్కులను సరి చేయించుకునే బాధ్యత పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బంది తీసుకోవాల ని ఆదేశించారు. ఇంటింటి నుండి చెత్త సేకరణ వంద శాతం చేపట్టాలని, రహదారులపై, మురుగు కాలువల్లో చెత్తాచెదారం వేస్తే



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

కలిగే అనర్ధాలను ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. నగరంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, తద్వారా కర్నూలుతో పాటు సమీప మున్సిపాలిటీల్లో వెలువడే వ్యర్ధాలతో విద్యుత్ తయారు చేయవచ్చన్నారు. మురుగు కాలువల్లో ఉన్న తాగునీటి పైప్‌లైన్‌లను తొలగించేందుకు ప్రతిపాదనలను రూపొందించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, ఇంచార్జీ యస్ఈ శేషసాయి, ఎంఈ సత్యనారాయణ, పట్టణ ప్రణాళిక సర్వేయర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. నగరంలోని వివిధ వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. ఏ కాంట్రాక్టర్ ఏఏ పనులు చేపట్టారు, పనుల పురోగతి ఏంటని ఆరా తీశారు. ఇంకా మొదలు పెట్టని పనుల విషయంలో సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభించి పూర్తికాని వాటి గురించి చర్చించారు. ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారో అడిగి వివరాలు నోట్ చేసుకున్నారు.తక్కువ ధరకు పనులు దక్కించుకుంటే నాణ్య తతో ఎలా చేస్తారని మంత్రి టి.జి భరత్ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం జవాబుదారీతనం తో పనిచేస్తోం దని, ప్రజలకు మంచి పాలన అందించేం దుకు కట్టుబడి ఉన్నామన్నారు. వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయం లో రాజీపడే ఉద్దేశం లేదన్నారు. తమకు చెడ్డపేరు తీసుకొచ్చేలా పనిచేస్తే చూస్తూ ఊరుకునేదిలేదని ఆయన హెచ్చరిం చారు. పనులు ప్రారంభించిన తర్వాత నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. సీఎం చం ద్రబాబు నాయుడు స్పీడ్ ఆఫ్ డూయిం గ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ వర్క్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. అందుకు తగ్గట్టే అందరూ పనులు త్వరగా చేయాల న్నారు. ప్రజలకు మంచి పాలన అందించ డంలో అందరూ భాగస్వామ్యం అవ్వాలన్నా రు.సమావేశంలోకాంట్రాక్టర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తమలో ఆత్మస్థైర్యం పెరిగింద న్నారు. పలు బిల్లులు పెండింగ్‌లోఉన్నాయని కాంట్రాక్టర్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బిల్లుల విషయంలో ఆలస్యమవ్వకుండా చూడాలని అధికారుల ను మంత్రి ఆదేశించారు. ఫైల్స్ క్లియరెన్స్ త్వరగా చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ యస్. రవీంద్ర బాబు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## 10వ వార్డు కార్పొరేటర్‌ను అరెస్టు చేయొద్దు

ః- మేయర్ బివై రామయ్య

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** గత నెల కౌన్సిల్ సమావేశంలో గొడవ పడ్డ 10వవార్డు కార్పొరేటర్‌యూనుస్‌ను అరెస్టుచేయవద్దని మేయర్‌బివై రామయ్య సోమవారం డిఎస్పీకి వినతిప్రతం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల కౌన్సిల్ సమావేశంలో 10వ వార్డు కార్పొరేటర్ యూనుస్ బాషా తన వర్గం వారికి మాట్లాడేందుకు కౌన్సిల్‌లో అవకాశం ఇవ్వ నందుకు ఆవేశానికి గురై కుర్చీ విరగగొట్టిన సంఘటనలో యూనుస్‌పై ఎస్‌సి, ఎస్‌టి దాడి కేసు 2వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లోనమోదైందన్నారు. కేసు రిజిస్ట్రర్ చేసి అతని అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అరెస్టు చేయకుండ కేవలం విచారణ మాత్రమే చేయాలని కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్‌ను కోరారు.

## నకిలీ రసీదులను తయారు చేసిన వ్యక్తి అరెస్ట్

**అవుకుమేజర్,న్యూస్ః** అవుకు మండలంలో జరిగిన వరి పంట లోడుకు సంబంధించిన నకిలీ రశీదులతో అవుకు నుండి వరి పంట లోడ్‌తో వైఎస్ఆర్ జిల్లా కమలాపురు గ్రామానికి ఏపీ21టిఈ 1827 నెంబరు గల లారీలో పం పిస్తుండగా బేతంచెర్ల మార్కెట్‌యార్డులో తనిఖీలు చేయగా సదరు రసీదులు తప్పుడు రసీదులు అని తెలియడంతో అవుకు గ్రామానికి చెందిన గురువయ్య కుమారుడు సాయి అను ముద్దాయి నకిలీ రసీదులను తయారు చేసినందున బనగానపల్లె మార్కెట్‌యార్డు కార్యదర్శి సోముల వెంకటేశ్వర రడ్డి ఫిర్యాదు మేరకు సోమవారంనాడు అవుకు ఎస్.ఐ రాజారెడ్డి కేసు నమోదు చేయడం జరిగింది.

# ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

శ్రీశైలం క్షేత్రాల దర్శనార్థం బయలు దేరారు.ఆయా పుణ్యక్షేత్రాల్లో స్వామివార్లను దర్శనం చేసుకొని ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణంలో నంద్యాల జిల్లా, డోన్ నియోజకవర్గం, ప్యాపిలి మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామ సమీపంలోకి రాగానే ఒక కుక్క కారుకు అడ్డం రావడంతో దానిని తప్పించబోయి, డివైడర్‌ను కారు ఢీ కొట్టడంతో పక్కనే పొలాలలోకి దూసుకెళ్ళింది. ఈ ప్రమాదంలో ముగ్గురు స్నేహితులు సంతోష్(36), నవీన్(43), లోకేష్ (35)లు అక్కడికక్కడే మృతి చెందారు. ప్యాపిలి పోలీసులు సమాచారం అందుకొని ఘటన స్థలానికి చేరుకొని గాయాలపాలైన స్నేహితుల సాయంతో ప్యాపిలిలోని ఓ ఆర్ఎంపి వైద్యుడి వద్ద ప్రధమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో డోన్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స కోలుకోలేక ముగ్గురు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన ముగ్గురికి స్వల్పగాయాలైయ్యాయి. అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు. దీంతో మృత్యువులోని వారి స్నేహం విడదీయరానిదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# అర్జీల పరిష్కారం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి ః** ప్రజల నుండి వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని చెప్పినప్పటికీ కొన్ని శాఖల అధికారులు వారం, 10రోజులైనా చూడడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సిడిపిఓ కర్నూలు అర్బన్, ఆదోని మున్సిపల్ కమీషనర్, తహశీల్దార్ కర్నూలు అర్బన్, డిప్యూటీ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ శాఖలకు సంబంధించి వారం నుంచి పదిరోజులైనా అర్జీలను చూడలేదని, అర్జీలను చూడకుంటే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. ప్రజల అర్జీలకు సంబంధించి నిర్లక్ష్యం చేయకూడదన్నారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీలను సక్రమంగా పరిష్కారం చేశారా లేదా అని ఆడిట్ చేయాల్సి ఉందన్నారు. ఈ అంశంపై ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు ఆడిట్ చేయడంలో పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే ఆడిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సిఎంఓ గ్రీవెన్స్‌లు పెండింగ్ ఉండకూడదని ఎప్పట కప్పుడు పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, అనురాధ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మం ను పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉంది

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :**

హిందూ దేశంలో సనాతన ధర్మంను పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీటీడీ దేవస్థానం, హింద ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వహకులు డాక్టర్ వ ల్లువెంకటరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో హనుమాన్ జయంతి కి సంబందించిన బ్యానర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడ తూ సనాతన ధర్మంను గురించి వివరించారు. ఈ నెల 22వ తేదిన హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. ఆ రోజు ఉదయం సీతారామాంజినేయుల విగ్రహమూర్తులకు అభిషేకం, సింధూరభిషేకం, ఆకుపూజ, విశేషార్చనలు సాయంత్రం శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గోర క్షన్ ప్రముఖ్ శ్రీరాములుయాదవ్, విశ్వహిందుపరిషత్ ప్రఖండ ఉపాధ్యక్షుడు సత్యనారాయణశెట్టి, ధర్మజాగారణ ప్రముఖ్ డమాం జగదీష్, బీజేపి మండల శాఖ అధ్యక్షుడు ము నిస్వామిగౌడ్, రమేష్, శివశంకర్, కోటయ్యశెట్టి, మునెప్ప, గజేంద్ర, రమేష్ పాల్గొన్నారు.

# టీడీపీ కార్యకర్తలే నా ప్రాణం

(మొదటి పేజీ తరువాయి)

5 మండలాలకు సంబంధించిన మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి ముందుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో కార్యకర్తలనుద్దేశించి బీసీ మాట్లాడారు. కార్యకర్తల కోసం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే ఏకైక పార్టీ టీడీపీ అని అన్నారు. పార్టీ కార్యకర్తల కోసం ప్రాణాలైనా అర్పించేం దుకు తాను సిద్ధమని అన్నారు. పేద ప్రజల కోసం కూడు, గూడు, గుడ్డ కల్పించాలన్న ఏకైక లక్ష్యంతో అన్న స్వర్గీయ ఎన్‌టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగువారి సత్తాను చాటారని అన్నారు. అదే బాటలో ఎంతో అనుభవం కలిగిన సీఎం నారా చంద్రబా బు నాయుడు పార్టీని మరింత ముందుకు తీసుకుపోతు న్నారని అన్నారు. గత ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఎన్నో కష్ట, నష్టాలు ఎదుర్కొని బాగా పని చేయడం వల్లే తన గెలుపు సాధ్యమైందని, కార్యకర్తల, నాయకుల కృషి జీవితంలో మరువలేనిదని అన్నారు. కార్యకర్తలకు అం దుబాటులో ఉండి సేవ చేసి వారి రుణం తీర్చుకుంటానని అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో తనకు మంత్రి పదవి ఇచ్చిన పార్టీ అధినేత సీఎం చంద్రబాబు నాయుడు, తనయుడు లోకేష్ బాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గత ప్రభుత్వం విధ్వంస పాలనలో ప్రజలు విసిగిపోయి ప్రతిపక్ష పార్టీకి కేవలం 11 సీట్లకే పరిమితం అయ్యేలా ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. 40 ఏళ్ళ అనుభవం కలిగిన సీఎం చంద్రబాబుకే ప్రజలు పట్టం కట్టారని, గత పాలనలో తనతోపాటు మరో 14 మందిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిన అదరలేదు, బెదరలేదని అన్నారు. తండ్రి బాటలో తనయుడు లోకేష్‌బాబు ఎన్నికష్టాలు వచ్చిన యువగళం పాదయాత్ర చేపట్టడం వల్ల ప్రజలు బ్రహ్మ రథం పట్టారని అన్నారు. గత వైఎస్ఆర్‌సీపీ పాలనలో



మద్యం కుంభ కోణం కేసులో ఐఏఎస్, ఐపీఎస్‌లు, మంత్రులు కేసుల్లో ఇరుక్కుం టున్నారని అన్నారు. ప్రజాస్వామ్య పద్దతిలో పాలించే సత్తా గల పార్టీ టీడీపీ అని అన్నారు. టీడీపీ పార్టీ అధికారంలో ఉంటే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు విశ్వసించడం వల్ల ఎన్‌డీఏ పార్టీ కూటమికి ప్రజలు అధికారం ఇచ్చారని అన్నారు. తమ ప్రభుత్వ హాయంలో రూ.వంద కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.25 కోట్ల ఆర్అండ్‌బీ రహదారుల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. రూ.4 కోట్లతో డిగ్రీ కళాశాలలో అధనపు గదుల నిర్మాణం, గతంలో నిలిచిన సంజామల–ముదిగేడు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని అన్నారు. బనగానపల్లెకు జీవనాడి అయిన దద్దనాల ప్రాజెక్టులో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రూ.28 లక్షలతో అభివృద్ధి చేయడం జరుగు తుందని అన్నారు. బనగానపల్లె ఆసుపత్రిలో రూ.25 లక్షలతో ఆసుపత్రిలో పరికరాలను తెప్పించడం జరిగిం దని అన్నారు. అభివృద్ధి అంటే తన హాయంలోనే చేసి చూపెట్టడం జరిగిందని అన్నారు. కోవెలకుంట్ల, సంజా మల, కొలిమిగుండ్ల, బనగాన పల్లె, అవుకు మండలాల కు సంబంధించిన నాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, రామేశ్వరరెడ్డి, బీవీ ప్రసాద్‌రెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి, గువ్వల సుబ్బారెడ్డి, పెండేకంటి కిరణ్, తదితర నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కార్యకర్తల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి



మినీ మహానాడుకు హాజరైన కార్యకర్తలు

**మహానాడును విజయవంతం చేయండి :** ఈనెల 27,28, 29వతేదీలలో జరగనున్న మహానాడు కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపుని చ్చారు. పార్టీ నిర్వహించే ఈ పసుపు పండగలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాల ని అన్నారు. కడప గడ్డపై జరిగే ఈ మహానాడును ప్రతి కార్యకర్త కార్యక్రమంలో పాలుపంచుకోవాలని అన్నారు. కార్యకర్తలు తరలి వెళ్లేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు.

# ఎంబిబిఎస్ సీటు దక్కించుకున్న మధుమతికి ఘన సన్మానం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కోటాలో ఎంబిబిఎస్ సీటు దక్కించుకున్న మధుమతిని శాలువా, పూలబొకే, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం ఆక్వాటిక్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి కె రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాజీ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గోరంట్ల రమణ, ఆక్విటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాము యాదవ్, స్విమ్మింగ్ కోచ్ నటరాజ్‌రావులు మాట్లాడుతూ డాక్టర్ అయ్యాక దయ, ప్రేమతో పేదవారికి సహాయం చేయాలని కోరారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. అప్పుడే శారీరకంగా మానసికంగా ఉంటారన్నారు. ఇప్పుడున్న ఒత్తిడీలకు ఎంతో మంది గురవుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పోర్ట్స్ కోటాలో మధుమతి ఎంబిబీఎస్ సీటు దక్కించుకోవడం చాలా గర్వకారణమన్నారు. సిఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే స్పోర్ట్స్ కోటాను 3శాతం పెంచినందుకు వారికి కూడా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మధుమతి, తల్లిదండ్రులు మద్దిలేటి, లక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆక్వాటిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రమేష్, మాజీ అసోసియేషన్ నాయకులు రామ్‌నాథ్, సీనియర్ సిమ్మర్లు గఫర్ మియా, నాగరాజు, జిల్లా కోశాధికారి దస్తగిరి, జిల్లా సహాయ కార్యదర్శి శివరాజ్, రవికుమార్, వెంకటేశ్వర్లు, శివరాం, రాఘవేంద్ర, బాలకృష్ణ, శివ, సిమ్మర్స్ వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


మధుమతిని అభినందన సభలో పాల్గొన్న జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్

## సమస్యల పరిష్కారానికి అధికారుల పర్యవేక్షణ అవసరం

**– నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు**



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కమీషనర్

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదులు పరిష్కారమయ్యేంత వరకు సంబంధిత అధికారుల పర్యవేక్షణ అవసరమని నగర పాలక కమీషనర్ ఎస్ రవీంద్రబాబు అన్నారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల సమస్యలకు సంబంధించి 26అర్జీలను స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమీషనర్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్న రాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎంఈ సత్యనారాయణ, ఆర్ఓ జునైద్, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాష, సర్వేయర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 22న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


మాట్లాడుతున్న కురువ సంఘం నాయకులు

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో పదవ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం అత్యధిక మార్కులు సాధించిన కురువ విద్యార్థులందరికి ఈ నెల 22న ప్రతిభా పురస్కారాలు అందచేయడం జరుగుతుందని జిల్లా కురువ సంఘం అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకె రంగస్వామిలు తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ ఆవరణలోని మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎంపి బస్తిపాడు నాగరాజు పాల్గొంటారన్నారు. ఎంపి చేతుల మీదుగా విద్యార్థులకు జ్ఞాపిక, సర్టిఫికేట్‌లు, నగదు బహుమతిని అందచేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ధనుంజయ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## తేదేపా మండల కన్వీనర్‌గా లాయర్ కృష్ణారెడ్డి



**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగు దేశం పార్టీ బండిఆత్మకూరు నూతన మండల కన్వీనర్‌గా సంతజూటూరు గ్రామానికి చెందిన ముమ్మడి నాగకృ ష్ణారెడ్డి ( లాయర్ కృష్ణారెడ్డి) ఎంపికయ్యా రు. శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి నియోజకవర్గ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో నియోజకవర్గంలోని 5 మండలాల నూతన అధ్యక్ష, కార్యదర్శుల పేర్లను ఎంపిక చేశారు. అందులో భాగంగా బండిఆత్మకూరు మండల నూతన కన్వీనర్‌గా లాయర్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.కోడూరు గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు చలమయ్యలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన మండల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు గ్రామాలలో పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, అభిమానులందరికీ వెన్నుదన్నుగా ఉంటూ ఎవరికి ఏ సమస్య వచ్చినా తాము ముందుండి నడిపించాలని ఆయన సూచించారు. అనంతరం నూతన మండల కన్వీనర్ నాగకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి చలమయ్యలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. వీరి ఎంపిక పట్ల పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## ప్రశాంతంగా పదవ తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు

**– జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు**

**– జిల్లా విద్యాశాఖాధికారి పి.జనార్ధన్‌రెడ్డి**


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి పి.జనార్ధన్‌రెడ్డి

**నంద్యాల నూనెపల్లి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పదవ తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు నంద్యాల జిల్లాలో తెలుగు పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 1231 మంది విద్యార్థులు గాను 729 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 502 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా తెలుగు పరీక్షకు 59.22 శాతం విద్యార్థులు హాజరై పరీక్షలు వ్రాసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 15 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా, జిల్లా విద్యాశాఖాధికారి ఒక పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేయగా మొత్తం 16 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు సజావుగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. అలాగే సార్వత్రిక విద్యాపీఠం పదవ తరగతి పరీక్షల్లో భాగంగా 4 పరీక్షా కేంద్రాలలో హిందీ పరీక్షకు 16 మంది విద్యార్థులకు గాను 12 మంది విద్యార్థులు హాజరు కాగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. అదే విధంగా ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా 2 పరీక్షా కేంద్రాలలో మొదటి రోజు హిందీ పరీక్షకు 68 మంది విద్యార్థులకు గాను 56 మంది విద్యార్థులు హాజరై పరీక్ష వ్రాయగా 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

## మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా సిహెచ్ లోకేశ్వరీ ఏకగ్రీవ ఎన్నిక

**– ప్రొసిడింగ్ అధికారి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**



**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సోమవారం ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యుల సమక్షంలో 42వ వార్డు కౌన్సిలర్ సిహె చ్ లోకేశ్వరి ఛైర్ పర్సన్ పదవికి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. 36వ వార్డు కౌన్సిలర్ సందీప్‌రెడ్డి ప్రతిపాదించగా, 40వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ బలపరచడానికి వ్యవహరించగా సి.హెచ్ లోకేశ్వరి ఏకగ్రీవంగా ఆదోని మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఈఎన్నికల్లో 36మంది వార్డు కౌన్సిలర్లు, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు. అనంతరం ప్రొసిడింగ్ అధికారి, సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సిహెచ్ లోకేశ్వరికి నియామక ప్రతాలు అందజేశారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ , ఛైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం చేయించారు.

## ఈతకు వెళ్ళి బాలుడు మృతి

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని ఎస్.రంగాపురం గ్రామానికి చెందిన రామాంజినేయులు, సునీతల కుమారుడు బండమీది చరణ్(10) ఈతకు వెళ్లి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే గ్రామానికి చెందిన రామాంజినేయులు, సునీతలకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. వేసవి సెలవులు కావడంతో గ్రామానికి చెందిన కొందరు తోటి పిల్లలతో కలిసి సమీపంలోని తోటలోకి చరణ్ ఈతకు వెళ్ళాడు. ఈతకు వెళ్ళిన చరణ్ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు వెళ్ళి వెతకగా చరణ్ విగత జీవిగా పడిఉండటాన్ని గమనించారు. ప్రేమతో, అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు హృదయరోదన స్థానికులు సైతం కన్నీరు పెట్టుకున్నారు.



## 22న జిల్లా స్థాయి మహానాడు

**– టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి**



**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** కర్నూలు జిల్లా మహానాడు కార్యక్రమం ఈ నెల 22వ తేదీన నగరంలోని కమ్మ సంఘం కళ్యాణ మండపం నందు నిర్వహిస్తున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు, సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయి మహానాడు కార్యక్రమాలు ఈ నెల 18,19,20వ తేదీల్లో నిర్వహించబడతాయని ఇప్పటికే కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాల్లో మహానాడు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని మిగిలిన నియోజకవర్గాల్లో కూడా పూర్తి కానున్నాయన్నారు. నియోజకవర్గాలు పూర్తయిన తర్వాత ఈ నెల 22న జిల్లా స్థాయి మహానాడును జిల్లా కమ్మ సంఘం కళ్యాణ మండపం నందు నిర్వహించడం జరుగుతుందని అన్ని స్థాయిలలోని పార్టీ శ్రేణులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## ఉపాధి పనుల వద్ద కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని బైరాపురం గ్రామంలో సోమవారం జరుగుతున్న ఉపాధి పనుల వద్ద రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే బడుగు, బలహీన వర్గాల వ్యవసాయ కార్మికుల అభ్యున్నతి కోసం తపించిపోయిన మహోన్నత నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. తమకు పిల్లలు పుడితే ప్రజాపోరాటానికి, ఉద్యమానికి ఆటంకం అని దేశ ప్రజలే తమ పిల్లలుగా భావించి వారి ఆస్తిని కూడా ప్రజా పోరాటాలకు ఇచ్చేసిన గొప్ప దంపతులన్నారు. అనేకసార్లు పార్లమెంట్ సభ్యునిగా, ఎమ్మెల్యేగా ఎన్నికైనా తమ సొంత పనుల కోసం కాకుండ నిరంతరం కార్మిక, కర్షకుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అన్నారు. యువత సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఆదినారాయణ, ఉపాధి మేటీలు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సూర్య
www.suryaa.com



# మున్సిపల్ ఛైర్మెన్‌గా సిహెచ్ లోకేశ్వరి ఏకగ్రీవం

- ఎన్నికల అబ్జర్వర్ నవ్య, సబ్ కలెక్టర్ భరద్వాజ్ నేతృత్వంలో ఎన్నిక..
- 36 మంది సభ్యుల బల ప్రదర్శనతో ఏకగ్రీవం
- బీసీ మహిళ ఛైర్మెన్ కావడంతో వైసీపీ నేతల సంబరాలు
- భారీ పోలీస్ బందోబస్తు



ఛైర్మెన్‌గా ఎన్నికైన సిహెచ్ లోకేశ్వరిని అభినందిస్తున్న మున్సిపల్ కమీషనర్



విజయోత్సవ సంబరాలను జరుపుకుంటున్న కౌన్సిలర్ల సభ్యులు



ఎన్నికలు నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్

**ఆదోని, మేజర్ న్యూస్** : రాష్ట్ర ఎన్నికల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికకు ఎన్నికల అబ్జర్వర్‌గా జాయింట్ కలెక్టర్ నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ భరద్వాజ్‌లు పాల్గొన్నారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించిన ఎన్నికలకు కార్యాలయ అధికారులు సర్వం ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఉదయం 10.30గంటలకు వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ హాలుచాంబర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ భరద్వాజ్ మాట్లాడుతూ, వైసీపీ పార్టీ తరఫున స్వామియే బాంబే 2005 ఎన్నికల నియామవళి ప్రకారం పత్రాలను ఇప్పటికే సమర్పించారన్నారు. ఎన్నికల నియామవళి ప్రకారం కోరంలో సగభాగం సభ్యులు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అంతకుమించి సభ్యులు సభకు హాజరుకావడం జరిగిందన్నారు. ఎన్నిక ప్రక్రియలోభాగంగా, ఎవరైతే చైర్‌పర్సన్‌గా నిలబడతారు. వారికి ఒకరు మెంబర్ సపోర్ట్ చేయాల్సి ఉంటుంది. మరోకరు బలపర్చాల్సి ఉంటుందన్నారు. వైసీపీ పార్టీ తర ఫున 42వ వార్డు కౌన్సిలర్ అయిన బీసీ మహిళ సిహెచ్ లోకేశ్వరిను చైర్‌పర్సన్‌గా బలపరుస్తూ 37వార్డు కౌన్సిలర్ సందీప్ ప్రప్రోజల్ చేశారు. అదేవిధంగా 40వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి అయిన ఫయాజ్ అహ్మద్ బలపరుస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎన్నికల అధికారి వీరుకాకుండా మరీ ఎవరైనా పోటీలో ఉండడానికి సిద్ధపడుతున్నారని, సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారికంగా చైర్‌పర్సన్‌కు ఎన్నిక చేసినట్లు సర్టిఫికెట్‌ను మంజూరు చేశారు. అనంతరం మున్సిపల్ కృష్ణ నేతృత్వంలో నూతనంగా ఎన్నికైన సిహెచ్ లోకే శ్వరిని చైర్‌పర్సన్ వేదిక మీద కూర్చోబెట్టి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి కో-ఆప్షన్ మెంబర్ అయిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి, బిజెపి కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. వైసీపీ బలపరుస్తున్న అభ్యర్థుల కౌన్సిలర్లతోపాటు ఎమ్మెల్సి డాక్టర్ మధుసూదన్ హాజరై చైర్‌పర్సన్ ఎన్నికను చేపట్టారు. అభినందన సభ అనంతరం వైసీపీ నేతలు బీసీ మహిళకు చైర్‌పర్సన్ పదవి రావడంతో మున్సిపల్ కార్యాలయం నుండి కార్యకర్తలు, నాయకుల మధ్య భారీ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు.

## రమణీయం, కమనీయం
# శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణం

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రావణ నక్షత్రం సందర్భంగా రేపాకుల సుబ్బరాయుడు సతీమణి వెంకట తులసమ్మ, శ్రీనివాసులు, రజని నాగేంద్ర ప్రసాద్,నాగజ్యోతి దంపతుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణం రమణీయంగా, కమనీయంగా జరిగింది. శ్రీవెంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రావణ నక్షత్రం రోజున ప్రతి నెల స్వామి వారి కళ్మాణం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. అదే విధంగా ఈ నెల 19వ తేదిన శ్రావణ నక్షత్రం రోజున నిర్వహించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి కళ్యాణం సందర్భంగా ప్రముఖ అర్చకులు కైప నరసింహ శాస్త్రి వేద మంత్రోచ్ఛారణలతో కళ్యాణ క్రతువుల్లో భాగంగా ఉదయం గణపతిపూజ, పున్యహవాచనం, కంకణ ధారణ, పట్టు వస్త్రాల సమర్పణ. 11.30 గంటల నుండి 12.45 గంటల సుమూహుర్తంలోని అభిజిత్ లగ్నంలో మంగాళ్య ధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా అధిక సంఖ్యలో . పాల్గోన్న భక్తుల సమక్షంలో కమణీయంగా, రమణీయంగా జరిగింది. అనంతరం స్వామి అమ్మవార్లను పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఉభయదారుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి పులి చిన్న ఓబుల్రెడ్డి, పులి మహేశ్వరరెడ్డి సుదర్శనెడి తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 21 నుండి యోగాంధ్ర క్యాంపెయిన్

– రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు



**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఈ నెల 21 నుండి జూన్ కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి : ఈ నెల 21 నుండి జూన్ 21వరకు జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం సెక్రటేరియేట్ నుండి అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లు, స్టేట్ ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూప్ ఆద్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, కోర్టు సముదాయాలలో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయం అంశాలపై చీఫ్ సెక్రటరీ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని విశాఖపట్నంలో నిర్వహిస్తారని ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు. జిల్లాల్లో గ్రామ గ్రామాన ప్రజలు యోగా దినోత్సవంలో పాల్గొనేలా విజయవంతంగా యోగా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని సిఎస్ ఆదేశించారు. ఈ నెల 21నుండి 27వరకు జిల్లా స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఉంటుందని, మే 28నుంచి జూన్ 3వరకు మండల స్థాయిలో, జూన్ 4నుంచి 16వరకు గ్రామ స్థాయిలో ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. యోగాపై అవగాహన కలిగే విధంగా ర్యాలీలు, రంగోలి కాంపిటేషన్స్ నిర్వహించాలన్నారు. ఆయా జిల్లాలకు సంబంధించి ప్రాజెక్టు పనులలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చెరువులను తలపిస్తున్న ప్రధాన రహదారి.!



**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో ప్రధాన రహదారి చెరువులను తలపిస్తుంది. శని అది వారాలలో కురిసిన వర్షాలకు మండలంలో ప్రధాన రహదారులు జలమయమయి నిండు కుండల కనబడుతుంది. కర్నూల్ గూడూరు వయా బెళగల్ మీదుగా యెమ్మిగనూరు వెళ్లే ప్రధాన రహదారి ఇలా చెరువులను తలపిస్తున ఘటన సి.బెళగల్ మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ఇలా నిండు కుండల దర్శన మీవ్వడం చూపరులను ఆశ్చర్యనికి గురించేసింది. మండల పరిధిలో సి.బెళగల్ కంబదహాల్‌లో రహదారులు పెద్ద మాడుగులుగా తయారయయి. ప్రభుత్వాలు మారిన మండల ప్రధాన రహదారి, మండల కేంద్రం నుండి గ్రామాలకు అనుసంధానం చేసిన రహదారులు ఆధ్వన స్థితిలో ఉండడం ప్రజలకు ప్రయాణదారులకు, వాహన దారులకు నిత్యం ప్రాణాలతో పోరాటం చేస్తున్న సాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు రహదారులపై పునరాలోచన చేసి



రహదారులను నిర్మించి ప్రజల ప్రాణాలకు భద్రత కలిపించాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పెద్ద వెంకటేష్ హత్య కేసులో
# మరో ఐదుగురు ముద్దాయిలు అరెస్టు..

ఐదుగురు ముద్దాయిలను రిమాండ్‌కు పంపిన పోలీసులు..



**హాలహర్వి, మేజర్ న్యూస్ :** హాలహర్వి మండలంలోని అమృతాపురం గ్రామానికి చెందిన కంటినేని శివన్న కుమారుడు పెద్ద వెంకటేష్ చౌదరిని వేట కొడవలితో నరికి చంపిన కేసులో మరో ఐదుగురు ముద్దాయిలను సిఐ రవిశంకర్ రెడ్డి,ఎస్సై చంద్రలు విరుపాపురం సమీపంలోని బోలగొట్టేశ్వర స్వామి దేవాలయం దగ్గర అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. సోమవారం ఎస్సై చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో సిఐ రవి శంకర్ రెడ్డి నిందితుల వివరాలు తెలుపుతూ అమృతాపురం గ్రామానికి చెందిన పెద్ద వెంకటేష్ వరుసకు సోదరుడు అయిన సోమన్న కు అప్పు ఇవ్వగా తిరిగి చెల్లించినా ప్రాంసరి నోట్లు ఇవ్వకుండా కోర్టులో కేసు వేసి భార్యను కూడా వేధిస్తున్నాడని భావించి గ్రామానికి చెందిన నటరాజ గౌడ్ సహకారంతో హెులగుంద కు చెందిన చాకలి నాగరాజు,ఉత్తనురు కు చెందిన బోగప్పలకు రెండు లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని,అదే గ్రామానికి చెందిన హరిజన ఈరన్న,బావ మరిది ధనుంజయ సహకారంతో సద్ద చేను దగ్గర పశువులు మేపడానికి వెళ్లిన వెంకటేష్ ను నరికి చంపినట్లు నిందితులు నేరం ఒప్పుకున్నట్లు సిఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. వారిని ఉదయం అరెస్టు చేసి వారి వద్దనున్న వేట కొడవలిని స్వాధీనం చేసుకొని రిమాండ్ కు పంపామని ఇది వరకే సోమన్న ను అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయి మహానాడును
# జయప్రదం చేయండి

– టీడీపీ ఇంఛార్జీ రాఘువేంద్రరెడ్డి



**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** నియోజక వర్గ కేంద్రమైన మంత్రాలయంలో జరుగు నియోజ కవర్గ స్థాయి మినీ మహానాడును జయప్రదం చేయాలని టీడీపీ ఇంచార్జీ రాఘువేంద్ర రెడ్డి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం రివర్ ఇన్ కళ్యాణ మండపం నందు సాయంత్రం 4గం టలకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నాలు గు మండలాల టీడీపీ నాయకులు, క్లస్టర్ యూనిట్, బూత్ ఇంచార్జీలు, మండల గ్రామ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# తట్టు రూబెల్లా నివారణకు టీకా ఒక్కటే మార్గం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** తట్టు రూబెల్లా వ్యాధి నివారణకు టీకా తీసుకోవడం ఒక్కటే మార్గమని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ హాలులో జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర మాట్లాడుతూ 9 నెలల నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఎంఆర్-1, ఎం ఆర్-2 వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవ్యాధిని రూపుమాపేందుకు నేషనల్ జీరో మీజిల్స్ రుబెల్లా ఎలిమినేషన్ క్యాంపెయిన్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అందుకు గాను 0.5సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా 3 టీకాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 0-5 సంవత్సరాల పిల్లలు 2,34,282మంది ఉన్నారని అందులో 27,540మందికి, రెండో టీకా 26,410మందికి ఇవ్వడం జరిగిందన్నారు. మొదటి విడత ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు, రెండో విడత జూన్ 23 నుంచి జూలై 26వ తేదీ వరకు ఉంటుందన్నారు. టీకాలు అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు.

**మెప్మా ఉత్పత్తులను కొనుగోలు చేయండి :** మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారు చేసి విక్రయిస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ మై స్టోర్ యాప్‌లో విక్రయిస్తున్న ఉత్పత్తులను



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఆన్‌లైన్‌లో ఓపెన్ చేసి జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ యాప్‌లో ఇప్పటి వరకు 1200వరకు ఉత్పత్తులను నాణ్యమైన పద్ధతిలో తయారు చేసి విక్రయించడం జరుగుతుందన్నారు. మై స్టోర్‌లో బుక్ చేసే ఉత్పత్తులను థర్డ్ పార్టీ ప్రతినిధుల ద్వారా వినియోగదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల నిబంధనలను అనుసరించి మాత్రమే జిల్లా అధికారులు తమ పరిధిలోని ఉద్యోగులను బదిలీలు చేపట్టాలన్నారు.

# రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్ళల్లో విస్తృత దాడులు

- ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు - ఎస్ఐ లక్ష్మి నారాయణ



**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా మండలంలోని మండ్లెం గ్రామంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచనలతో మండ్లెం గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించినట్లు జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్ళల్లో సోమవారం దాడులు నిర్వహించామని అన్నారు. తెల్లవారు జామున నేర నివారణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కార్డెన్ సర్చ్ నిర్వహించామని అన్నారు. గ్రామంలో ఏలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా, ముఖ్యంగా పోలీసులు ప్రజల కొరకు, ప్రజల రక్షణ కొరకే ఉన్నారని, ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించేందుకు ఈ కార్డెన్ సర్చ్ ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ కార్డెన్ సర్చ్‌లో పోలీసులు, పోలీస్ సిబ్బంది బృంధాలుగా ఏర్పడి నేరచరిత్ర కలిగిన వారి ఇళ్ళల్లో సోదాలు నిర్వహించి నిల్వ ఉంచిన అక్రమ మద్యం, 30 క్వార్టర్ బాటిళ్ళను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా గ్రామంలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు.

# నూతన కార్యవర్గం ఏర్పాటు



**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా హెల్త్ సిబ్బంది నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం అధ్యక్షురాలు మైమూన్ తెలిపారు. అధ్యక్షులుగా మైమూన్, సెక్రటరీగా దేవకృప, అసోసియేషన్ ప్రసిడెంట్‌గా లక్ష్మి, వైస్ ప్రసిడెంట్‌గా లక్ష్మిదేవి, సుజాత, మాధవి, చాముండేశ్వరి, ట్రెజరర్‌గా అనంతపురం నుంచి సుమతి, ప్రమీళ, ధనలక్ష్మి, ఆశీర్వదం, కడప నుంచి శారద, సరోజినిలను ఎన్ను కున్నట్లు తెలిపారు. ఈ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు జయల క్ష్మి ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మైమూన్ మాట్లాడుతూ హెల్త్ సిబ్బంది సమస్యలను పరిష్కరించే విధంగా తనవం తు కృషి చేస్తానని అన్నారు. ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో చాలా ఇబ్బందు లు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు, రావాల్సిన తమ డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో దోమల నివారణకు ముందస్తు చర్యలు



**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు సౌకర్యార్థం దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టారు. సోమవారం మండలంలోని కస్తూరిబా, ఆదర్శ పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాలలోని వసతి గృహాలలో దోమల నివారణకు గదులలో దోమల మందులను పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవోలు హుస్సేన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌లు పాల్గొన్నారు.

# ఎన్నికలప్పుడు టిడిపి కార్యాలయానికి వచ్చా

- నంద్యాల మినీ మహానాడులో ఏవి చురకలు
- ఏడాది తరువాత మినీ మహానాడుకు కార్యాలయానికి వచ్చా
- మహానాడు ఖర్చును ఆలోచించాలి
- ఇది కరెక్టేనా! నేతలు ఆలోచన చేయాలి
- ఏడాదికొకసారి కాకుండా ఆరు లేదా మూడు నెలలకో సమావేశాలు పెట్టండి
- మినీ మహానాడులో టిడిపి సీనియర్ నేత ఏవి సుబ్బారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎవి సుబ్బారెడ్డి

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల నియోజకవర్గ మిని మహానాడులో టిడిపి సీనియర్ నేత ఎవి సుబ్బారెడ్డి తన ప్రసంగంలో టిడిపి నేతలకు చురకలు అంటించారు. మహానాడును పురస్కరించుకొని నంద్యాలలో మిని మహానాడు ఏర్పాటు చేసి మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నామంటూ మొదలు పెట్టిన ఎవి సుబ్బారెడ్డి తన ప్రసంగంలో చేసిన వాఖ్యలు జిల్లా తెలుగుదేశం పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుత సమావేశం ముఖ్య ఉద్దేశ్యం మహానాడు సభను విజయంతం చేయడని హాజరైన ప్రముఖులు తనతో సహ చెబుతాము. కానీ ఎంత వరకు విజయవంతం చేస్తారా అన్నది ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త ఆలోచన చేయాలన్నారు. విజయవంతం చేయడానికి అందరూ సిద్దంగానే ఉంటారంటే అందుకు ఖర్చు అవుతుందని తన చెబుతూనే ఆ అంశాన్ని ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలన్నారు.ఎంత ఖర్చు పెడితే అంత మంది నాయకులు, కార్యకర్తలు మహానాడు వస్తారన్నారు. ఖర్చు పెట్టకపోతే మహానాడు విజయవంతం అలానే ఉంటుందన్నారు. ఈ అంశాన్ని ఆలోచన చేసుకోవాలని కోరారు. ఇదే కరెక్టా కాదా అని హాజరైన కార్యకర్తలు ప్రశ్నించారు. నేను మాట్లాడే మాటలు వివాదాస్పదమైనవి ఏమి కాదని, ఉన్న విషయాన్నే చెబుతున్నానన్నారు. ఎన్నికలకు కోట్లు పెడుతున్నామని, ఇలాంటి వారికి ఖర్చు పెట్టాలన్నారు. ఇంకో విషయం ఫిరోజ్‌కు చెబుతున్నాను, ఇది విమర్శ అనుకోవద్దంటూ ఏడాది తరువాత నంద్యాల టిడిపి కార్యాలయానికి వచ్చానన్నారు. ఎన్నికలప్పుడు కార్యాలయానికి వచ్చి ఇప్పుడు రెండవ సారి వచ్చింది. తరువాత సంవత్సరం తరువాత బాబాన్, రామచంద్రరావు, తులసిరెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి చూస్తున్నా, అందరిని సంవత్సరం చూస్తున్నానన్నారు. అది కరెక్టా కాదా అన్నది ఆలోచన చేయాలన్నారు. మహానాడును విజయవంతం చేయాలని మిని మహానాడు పెట్టాం. మిని తెలుగుదేశం పెడతారో ఏమి పెడతారో మూడు నెలలకో, ఆరు నెలలకో మండలం ఒకసారి, పట్టణం ఒకసారి పెడితే పనులు ఎంతవరకు జరుగు తాయో తెలియదు కానీ, సంవత్సరానికి ఒకసారి కా కుండా ఆరు నెలలకు ఒకసారి మిమ్మల్ని చూడచ్చు న్నారు. ఒకరిని ఒకరిని చూసుకుంటాం నన్ను ఎంతో ఆప్యాయంగా మహిళలు పలకరించారన్నారు. చాన్నాళ్లైందన్న నిన్ను చూసి అన్నారన్నారు. మళ్లీ ఎప్పుడు చూస్తారు ఏదో సమావేశం ఉన్నప్పుడన్నారు. మహానాడు కాబట్టి సమావేశం పెట్టాం...మళ్లీ ఎప్పుడు పెడతామో తెలియదన్నారు. అప్పుడు వరకు నన్ను మీరు చూడలేరన్నారు. మిమ్మల్ని నేను చూడలేనన్నారు. ఏది ఎమైతేనేమి ఇది విమర్శ అనుకోకుండా మహానాడును మాత్రం వంద శాతం ఎందుకంటే 160 సీట్ల పై చిలుకు ఎమ్మెల్యేలను సాధించామన్నారు. మహానాడు భారీ ఎత్తున జరుగుతాది, కన్నుల విందుగా సాగుతాది ప్రతి ఒక్కరు ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# వెలుగోడు మండల పట్టణ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక


అబ్దుల్ కలాం


మోమీన్ రసూల్


కలీలుల్లా ఖాన్

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి నియోజకవర్గ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన మినీ మహానాడు కార్యక్రమంలో నియోజకవర్గంలోని 5 మండలాల నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేశారు. అందులో భాగంగా వెలుగోడు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా ఎంఏ అబ్దుల్ కలాం, మండల ప్రధాన కార్యదర్శిగా గుంతకందాల గ్రామానికి చెందిన రమణ, వెలుగోడు పట్టణ అధ్యక్షులుగా మోమీన్ రసూల్, ఉపాధ్యక్షులుగా వీరభద్రుడు, తేదేపా టౌన్ క్లస్టర్‌గా కలీలుల్లా ఖాన్ నియంమితంలయ్యారం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. వీరి ఎంపిక పట్ల పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

# వెలుగోడు ఎస్ఐగా సురేష్ బాధ్యతలు


ఎస్ఐ బి.సురేష్

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** సాదారణ బదిలీల్లో భాగంగా వెలుగోడు మండల ఎస్ఐగా బి.సురేష్ నియమితుల య్యారు. వెలుగోడు మండల ఎస్ఐగా బి.సురేష్‌ను నియమిస్తూ జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల టూటౌన్ ఎస్ఐగా పని చేస్తున్న ఈయనను బదిలీపై వెలుగోడు ఎస్ఐగా పోలీస్ శాఖ నియమించింది. ఈయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని, అవినీతి, అక్రమాలు జరగకుండా చూసుకుంటానని అన్నారు. అసాంఘీక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# అనుమానిత వ్యక్తుల ఇళ్ళల్లో విస్తృత సోదాలు



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** రౌడీ షీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమాస్పద వ్యక్తుల ఇళ్ళల్లో జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నేర నివారణ, శాంతి భద్రతల పరిరక్షణనే లక్ష్యంగా జిల్లా పోలీసులు తెల్లవారు జాము నుంచి కార్డెన్ సర్చ్ ఆరేషన్ నిర్వహించారు. రౌడీ షీటర్లు, నేరచరిత్ర గల వారి ఇళ్ళల్లో సోదాలు నిర్వహించారు. అక్రమ మద్యం, సరైన ధృవపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, అతిమీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆత్మకూరు సబ్ డివిజన్‌లో ధృవపత్రాలు లేని 8 మోటార్ సైకిళ్ళను, 44 అక్రమ మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిరంతరం జరుగుతుందని పోలీసులు తెలిపారు.

# పి.చింతకుంట గ్రామంలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**సంఘ విద్రోహశక్తుల ఆట కట్టించి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానస్పద వ్యక్తుల ఇళ్ళల్లో విస్తృతంగా దాడులు**

**సరైన ధృవపత్రాలు లేని 22 వాహనాలు స్వాధీనం..**



పోలీసులు తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** సంఘవిద్రోహ శక్తుల ఆటకట్టించి నిరరహితంగా తీర్చిదిద్దులమే లక్ష్యం అని ఆళ్లగడ్డ పట్టణ సీఐ యుగంధర్ అన్నారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చింతకుంట్ల గ్రామంలో సోమవారం ఉదయం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు, ఆళ్లగడ్డ డి.ఎస్.పి ప్రమోద్ సూచనలతో ఆళ్లగడ్డ టౌన్ ఇన్స్పెక్టర్ యుగంధర్, రూరల్ ఇన్స్పెక్టర్ మురళీధర్ రెడ్డి ల ఆధ్వర్యంలో ఎస్సైలు, పోలీసులు, క్యూఆర్టి సిబ్బంది సహకారంతో బృందాలుగా ఏర్పడి నేరనివారణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కార్డెన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సంధర్భంగా సీఐ మాట్లాడుతూ ఆళ్లగడ్డ పోలీస్ స్టేషన్ ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలను నివారించడమే లక్ష్యంగా కార్డెన్ సర్చ్ నిర్వహించామన్నారు. గ్రామాలలో ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా నివారించుటకు పోలీసులు ప్రజల కొరకుఉన్నారనే భరోసా కల్పించడం కొరకు ఈ కార్డెన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఈ సెర్చ్ ఆపరేషన్ లో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది బృందాలుగా ఏర్పడి గ్రామంలోని అనుమానితులు, రౌడీ షీటర్లు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించగా సరైన ధ్రువపత్రాలు లేని 22 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నగిన, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇస్కాలలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**8 మోటర్ సైకిల్లు 14 క్వార్టర్ బాటిల్లు స్వాధీనం**



**పాములపాడు, మేజర్ న్యూస్ :** పాములపాడు మండల పరిధిలోని ఇస్కాల గ్రామంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు డిఎస్పి రామాంజనేయ ఆధ్వర్యం లో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్సై సురేష్ బాబు గ్రామంలో కార్డెన్ అండ్ సర్చ్ చేపట్టారు గ్రామంలోని రౌడీషీటర్లు అనుమానిత ప్రాంతాలు అనుమానాస్పద వ్యక్తుల నివాసాలలో సోదాలు నిర్వహించారు అనంతరం సీఐ సురేష్ కుమార్ రెడ్డి ఎస్ఐ సురేష్ బాబు లు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా గార్డెన్ అండ్ సెర్చ్ తెల్లవారుజామునే గ్రామంలోని అనుమానిత వ్యక్తుల నివాసాలు సోదా చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 8 మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు గ్రామంలో అక్రమ మద్యం 14 బాటిళ్లు పట్టుకున్నట్లు తెలియజేశారు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# ఒక్కటవుదాం..కడప మహానాడును విజయవంతం చేద్దాం



దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టి రామారావు కటౌట్‌కు పూలమాల వేసి నివాలులర్పిస్తున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడి అత్యధిక సీట్లు సాధించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరానికి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 27,28,29న కడపలో జరిగే మహానాడును విజయవంతం చేయడానికి తెలుగుదేశం పార్టీ నేతలు అంతా ఒక్కటై ఢిల్లీకి మనసత్తా ఏమిటో నిరూపించుకునే విధంగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలనే ఉద్దేశంతో నంద్యాలలో రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశాల మేరకు మినీ మహానాడును పట్టణంలోని రాజ్ థియేటర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ అధ్యక్షత వహించగా మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ఏపీ సీడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, టీడీపీ అబ్జర్వర్ రవికుమార్, కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథరెడ్డిలు పాల్గొన్నారు. ముందుగా దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టి రామారావు కటౌట్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ మహానాడు జరిగే ముందు ప్రతి నియోజకవర్గంలో మినీ మహానాడు నిర్వహిస్తామని అందులో భాగంగా నంద్యాలలో మహానాడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు వారి సలహాలు, సూచనలు ఇస్తే వాటిని మహానాడులో ప్రస్తావిస్తామన్నారు. నంద్యాలలో పలు సమస్యలను మహానాడులో తీర్మానం చేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ కార్యకర్తల సమిష్టి కృషితోనే తెలుగుదేశం పార్టీ నంద్యాలలో బారీ మెజారిటీతో టీడీపీ జెండాను ఎగురవేసిందన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మంత్రి ఫరూక్ 43ఏళ్లుగా పార్టీకి అంకితమై సేవలందిస్తున్నారన్నారు. తెలుగుదేశం పారీట కార్యకర్తకు ఏ సమస్య వచ్చినా అర్ధరాత్రి అపరాత్రి అని తేడా లేకుండా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. మాజీ సండే ఎమ్మెల్యే ఆదివారం నంద్యాలకు వచ్చి ఒక రెండు పెళ్ళిళ్లకు హాజరై ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి తమ నాయకులపై బురద చల్లి తిరిగి వ్యాపారాలు హైదరాబాద్ నగరానికి వెళ్లిపోయారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆదివారమే, ప్రతిపక్షంలోను ఆదివారమే నంద్యాల ప్రజలకు దర్శనం ఇచ్చి కనీస పరిజ్ఞానం లేని మన మాజీ సండే ఎమ్మెల్యేకు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే స్థాయి లేదన్నారు. మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ఏవి సుబ్బారెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డిలు మాట్లాడుతూ కడపలో జరిగే మహానాడును విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, అభిమానులు అందరూ ఒక్కటై మహానాడుకు తరలి రావాలన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు రామచంద్ర రావు, ఏవీఆర్ ప్రసాద్, జిల్లెల్ల శ్రీరాములు, సాగునీటి వినియోగదారుల సంఘం చైర్మన్ ఇలియాస్, డాక్టర్ బాబన్, మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వరరెడ్డి, మాబువలి, నాగార్జున, శ్రీదేవి, బాబు తదితరులు పాల్గొన్నారు.

# పదవులకే వన్నెతెచ్చిన నేత "నీలం సంజీవరెడ్డి"

**ఘనంగా మాజీ రాష్ట్రపతి "నీలం "జయంతి వేడుకలు**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** భారత మాజీ రాష్ట్రపతి తెలుగు బిడ్డ స్వర్గీయ "నీలం సంజీవరెడ్డి"112 వ జయంతి కార్యక్రమం "నంది రైతు సమాఖ్య" కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సమాఖ్య గౌరవ సలహాదారులు విశ్రాంత శాస్త్రవేత్త డా. కాదరబాద్ రవీంద్రనాధ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ సాహితీ సంఘాల ప్రతినిధులు, రైతు సంఘాలనాయకులుసంజీవరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసిఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ నీతికి నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచి రైతు నుండి రాష్ట్రపతిగా ఎదిగిన సంజీవరెడ్డి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో నంది రైతు సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం



**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలములో ఖాళీగా ఉన్న క్షేత్రస్థాయి సహాయకులను నియమించినట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్‌తెలిపారు. సోమవారం గ్రామ పంచాయితులని కొత్తగా నియమించబడిన క్షేత్రస్థాయి సహాయకులకు ఉత్తరవు కాపీలను ఆయన అందజేశారు. ఆర్డర్ కాపీలను ఇవ్వడము జరిగింది. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఏపీఓ ఖాసిం మాబు పీరా గొడిగినూరు బాబ2. డి.వనిసింది నరసింహుడు3. మల్లివేములనందిని.4. చిన్న వంగలి నర్సిరెడ్డి5. చిన్న భోజదనం హితేశ్వర్ రెడ్డి6. బింతలఏరువు గోవింద రెడ్డకి నియామక పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

# సారూ.. కరెంటు లేక అల్లాడుతున్నాం..



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండలంలోవరుసగా మూడు రోజులు పాటు ఈదురుగాలులు. భారీ ఉరుములు మెరుపుల వర్షాలుకురవడంతోచిన్నతుంభళం గ్రామంలో నాల్గవ వార్డు వీధిలో నాలుగు రోజుల నుంచి రాత్రి కరెంటు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురికావడం జరిగిందని కాలనీకి చెందిన మంగళిసంజప్ప.చాకలిసన. వీరభద్రగౌడు, చంద్ర, పోతరాజు, అయ్యప్ప సోమవారం విలేకరులకు తెలిపారు. అలాగే ప్రస్తుతం ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను మార్చుమని విద్యుత్ శాఖ మండల ఎఈ. సిబ్బంది కి చెప్పిన వారు పట్టించుకోవడం లేదని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చెడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌షారమ్ స్థానంలో మరో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నామని అన్నారు.

# కన్నుల పండుగగా శ్రీ లక్ష్మమ్మ అవ్వ జాతర

**- భక్తీ శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్న ప్రజలు**



శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ రథోత్సవం దృశ్యం

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** ఆదోని ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత, కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మ అవ్వ జాతర కనుల విందుగా జరిగింది. సోమవారం అవ్వ 93వ రథోత్సవం వేడుకలు ఆదోని పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ వంశపార్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య నేతృత్వంలో అవ్వ జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయ పూజారులు అవ్వకు పంచామృతాభిషేకం, మంగళ హారతి, పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో, పూలతో ముస్తాబు చేసి, నూతన బంగారు కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. తెల్లవారుజామున నుంచే అవ్వకు మొక్కుబడులు తీర్చుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో తమ మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ పురవీధుల్లో శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ రథోత్సవం అశేష భక్తుల నడుమ ఎంతో దేదీప్యమానంగా జరిగింది. శ్రీ లక్ష్మమ్మ అవ్వ రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిలు, రాజకీయ నాయకులు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

మొదటిసారిగా శ్రీ లక్ష్మమ్మవ్వ వారికి బంగారు కిరీటంతో అలంకరించారని, అవ్వ దివ్యాశీసులు ఆదోని ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే పార్థసారథి ఆకాంక్షించారు. ఒక ఎమ్మెల్యేగా అమ్మవారి రథోత్సవం కార్యక్రమంలో తాను కూడా భాగస్వాములు కావడం తన అదృష్టంగా భావిస్తానని తెలిపారు. జాతర సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్త్ చర్యలు చేపట్టారు.

# పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తి తో కులవివక్ష వ్యతిరేక పోరాటం



**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** సుందరయ్య స్ఫూర్తి తో కులవివక్షతవ్యతిరేఖ పోరాటం కొనసాగించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, సీపీఎం నాయకులు నబిరసూల్, వేణు అన్నారు. సోమవారం గోనెగండ్లలో పుచ్చల పల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బస్టాండ్ ప్రాంగనం నందు ఆయన చిత్రపటానికి పూల మాల వేసినివాళి అర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు కరుణకర్ మాట్లాడుతూ ఆయన పేద ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. పుచ్చలపల్లి సుందర్రామిరెడ్డి గా ఉన్నతన పేరును పుచ్చలపల్లి సుందరయ్యగా మార్చుకున్న మొట్టమొదటి గొప్పవ్యక్తి అని వారు కొనియాడారు. ప్రతి ఒక్కరికి సుందరయ్య ఆదర్శప్రాయుడని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సం ఘం నాయకులు బాబు, ఆది, నల్లారెడ్డి, రాజు, వీరేష్, వీరా, జీవన్, నాగరాజు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కిట్లు పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ నియోజవర్గంలోని జనసేన పార్టీ తాలూకా కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వం నమోదు కిట్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఈసందర్భంగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత కిట్లను ఆళ్లగడ్డ తాలూకా జనసేన నాయకులుఇరిగేల రాంపుల్లారెడ్డికి,అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డికి సభ్యత్వ నమోదు గుర్తింపు కార్డులను, జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రశంసా పత్రాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ తాలూకా జనసేన నాయకులు, రాయలసీమ జోన్ కమిటీ సభ్యులు ఎం ఎస్ మాబు హుస్సేన్, ఉయ్యాలవాడ మండల నాయకులు దూదేకుల కొట్లో బాబు, దొర్నిపాడు మండల నాయకులు తిమ్మరాజు, జనసేన నాయకులు శేఖర్ రెడ్డి,హుస్సేన్ , బాదుల్లా, సంతోష్ తదితరులు ఉన్నారు.

## పెద్దమర్రివీడు వీధులలో నిలిచిన చెత్తచెదారం




**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామం వీదులలో అపరిశుభ్రత నెలకొంది. గ్రామంలోని చెత్త చెదారం మురికి కాలువలలో పెరుకు పోవడంతో దోమలు ఈగల ప్రభలి అంట రోగాలు ప్రభలు తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షం కారణంగా మురికి కాలువలలో చెత్త పేరుకు పోవడం తో మ రుగునీరు అంతా రోడ్లపై కి వచ్చాయి. అలాగే తాగునీటి ట్యాంక్ ల దగ్గర చెత్తచెదారం పెరుకు పోవడంతో దుర్గంధం వ్యదజల్లుతుంది. ఇప్పటికై పంచాయతి అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల కేంద్రంలో స్థానిక గ్రామ సచివాలయం నెం-2ను ఎంపిడిఓ ప్రభావతిదేవి ఆకస్మీకంగా తనిఖీ చేశారు. సచీవాలయంలోని విధులను నిర్వహిస్తున్నా సిబ్బంది అటెండెన్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. అలాగే ఈకెవైసి సర్వే వంటి వాటిపై ఆరాతీశారు. విధులు పట్ల భాధ్యత యుతంగా పని చేయా లని సిబ్బందికి అమె సూచించారు. అలాగే సిబ్బంది పని తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నా రు. ఈమె వెంట డిజిటిల్ అసిస్టెంట్ మమత. వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్. ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రావణి. తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సప్లమెంటరీ పరీక్షకు భారీగా గైర్హాజరు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో సోమవారం నిర్వహించిన పదవతరగతి తెలుగు సప్లమెంటరీ పరీక్షకు ఇరవై మంది విద్యార్థులు గైహాజరు అయ్యారని పరీక్ష నిర్వాహకులు తెలిపారు. మండలంలో రెండు పరీక్ష కేంద్రంలో మొత్తం90మంది విద్యార్థులకు అనుమతులు ఉండగా ఏపీ మోడల్ 36మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా తొమ్మిదిమంది విద్యార్థులు గై హాజరైయారని,జడ్పీ హై స్కూల్ లో 34మంది హాజరై 11మంది గైర్హాజరైయారని తెలిపారు.

## రోడ్డుపై వర్షపు నీరు.. ఇబ్బందులుపడుతున్న వాహనదారులు

**శాశ్వత పరిష్కారం చూపని అధికారులు**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షం కారణంగా ఎమ్మిగనూరు పట్టణంలోని పలు ప్రధాన రహదారుల్లో రోడ్డుపైనే వర్షపు నీరు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ప్రధాన దారి అయిన కర్నూలు బైపాస్ వద్ద వర్షపు కురిస్తే మాత్రం కాలువలు మాదిరిగా రోడ్డుపైన నీళ్లు నిలిచిపోతున్నాయి. ఈ ప్రధాన రహదారి వైపు ప్రతి రోజు వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. గతంలో ఇలాంటి పరిస్థితి నెలకొనడంతో అధికారులు తాత్కాలికంగా రోడ్డు వేశారు. తిరిగి మళ్లీ వర్షం వచ్చే సమయానికి కొట్టుకొని పోయి గుంత ఏర్పడి వర్షపు నీళ్లు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు జారీ కిందకు పడిన పరిస్థితి కూడా ఉన్నాయి. ఈ రహదారుల్లో డ్రైనేజీ కాలువలపై దాకాణాలు అడ్డు ఉండడంతో ఈ వర్షపు నీరు డ్రైనేజీల్లో వెళ్లకుండా రోడ్డుపైన నీరు ఆగిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీపై ఉన్న దుకాణాలను తొలగించి, వర్షం వస్తే ఇలాంటి పరిస్థితి రాకుండా కర్నూలు బైపాస్ రహదారిపై శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.


కర్నూలు బైపాస్ రోడ్డు వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

## శ్రీ చెన్నకేశవ ఆంజనేయ స్వామి భూములకు కౌలు వేలం..

**64 ఎకరాలకు..రూ. 2.87 లక్షలకు పాడిన రైతులు...ఈ వో.. ఆర్ వీరయ్య**



**తుగ్గలి,మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన తుగ్గలి శ్రీ చెన్న కేశవ ఆంజనేయ స్వామి భూముల కౌలు సాగుకు సోమవారము మండలకేంద్రమైనతుగ్గలిఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర బహిరంగ వేలంలో రైతుల 64 ఎకరాలకు రు. 2.87 లక్షలకు నిర్వహించినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫిసర్ ఆర్ వీరయ్య విలేకరులకు తెలిపారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం శ్రీ చెన్నకేశవ ఆంజనేయస్వామి దేవాలయమునకు చెందిన ఈ క్రింది తెలిపిన 767/1 సర్వే నెంబరులో 6.42 ఎకరాలను 46 వేలకు,801 సర్వే నెంబర్‌లో 8.57 ఎకరాలు రు 17,000, 13 సర్వే నెంబర్లు 29.72 ఎకరాలును రు. 1.50 క్షణకు,13 సర్వే నెంబర్లు 20.72 ఎకరాల ను రూ. 1.50 లక్షలు, సర్వేనెంబర్ 570/2లో ఉన్న 27.02 ఎకరాలను రూ.74,000 రైతులు కౌలు కు పాడినట్లు వారు తెలిపారు. ఈ వేళము హిందూ దేవాదాయ ధర్మాదాయ చట్టం 30/87 మేరకు నిర్వహించబడినట్లు వారు తెలిపారు. డిపాజిట్ మొత్తము మూడవ సంవత్సరం కౌలులోజమ చేసుకొనబడునన్నారు. కౌలు కాలము మూడు సంవత్సరములు 2025 నుండి 2028 సంవత్సరం వరకు ఉంటుందని కార్యనిర్వాకాధికారి వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో శాలివాహన మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర సర్పంచ్ రవి ప్రసాదు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సచివాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనం

**సమయపాలన పాటించని సిబ్బంది**


ముత్యాలపాడు-1వ సచివాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనం ఇస్తున్న దృశ్యం

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండలంలోని ముత్యాలపాడు-1వసచివాలయంలో సోమవారం ఖాళీ కుర్చీలు దర్శనం ఇచ్చా యి. సంబంధీత అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించక పోవడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురౌతున్నారు. వీరిపై ఉన్న త అధికారుల అజమాయిషి లేకపోవడంతో విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించి, సచివాలయానికిహాజరై ఫేస్‌యాప్, హాజరు పట్టి ద్వారా తమ హాజరును నమోదు చేసి విధులకు డుమ్మా కొడుతున్నా రని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా ప్రస్తుతం రేషన్కార్డులలో పేర్లు చేర్పులు, మార్పులు. తోలగింపులకు ప్రభు త్వం అవకాశం' కల్పించింది. అయితే ముత్యాలపాడు-1 సచివాలయంలో సిబ్బంది కాని సంబంధిత అధికారులుగానీ అందుబాటులో లేక పోవడంతో సమస్య పరిష్కారానికి ఎవరి వద్దకు ' వెళ్ళాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై వారం రోజులుగా ఎంపిడిఓకు. రాజేంద్రప్రసాద్కు ఫిర్యాదు చేయగా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సచివాలయ సిబ్బందికి మెమో జారీ చేసిట్లు తెలిపారు. ఇప్పటికైన సచివాలయ సిబ్బంది విధులలో కొనసాగేటట్లు అధికారులు పర్యవేక్షించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కొరుతున్నారు.

## ఆపరేషన్ సింధూర్ హర్షణీయం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** పహల్గామ ఉగ్రదాడికి ప్రతిగా ముష్కర పాకిస్తాన్‌పై భారత్ జరిపిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం హర్షనీయమని, ప్రతి ఒక్కరు భారత పౌరులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి రుణపడి ఉండాలని శ్రీశైలం నియోజకవర్గం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలతో కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే బుడ్డా నంద్యాల టర్నింగ్ నుంచి గౌడు సెంటర్ వరకు తిరంగ్‌యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రదాడుల్లో మృతి చెందిన వీరజవాన్ మురళీ నాయక్ చిత్రటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయవంతం హర్షనీయమని, భారత త్రివిధ దళాలకు ప్రతి ఒక్కరు ప్రత్యేక కృతజ్ఞతాభినందనలు తెలపాలన్నారు. ముష్కర పాకిస్తాన్ పీచమనిచి భారత ప్రజలకు భద్రత కల్పిస్తున్న భారత సైనికుల త్యాగాలు మరువలేనివని అన్నారు. ఈ తిరంగ్ యాత్రలో మాజి సైనికులు, అధికారులు, రైతులు, యువజనులు, కర్షక కార్మిక వర్గాలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


సైనిక విజయానికి మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి పట్ల
## ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** శ్రీశైలం దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు బోల్తాపడి ముగ్గురు మరణించడంపై రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌళిక సదుపాయాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కర్నాటకకు చెందిన ముగ్గురు మృతి చెందడంతో మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించాలని డి.ఎం.హెచ్.ఒకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

## ప్రజా వినతులను నాణ్యతతో పరిష్కరిస్తాం

**-మండల ఇంఛార్జీ తహశీల్దార్ పురుషోత్తమ్ముడు**



**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో అధికారులు పిజిఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుండి ఇటు తహశీల్దార్ కార్యాలయంలో అటు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు వినతులు స్వీకరిచారు. అనంతరం వినతులను నాణ్యతతో పరిశీలించి నిర్ణత సమయంలో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల ఇంచార్జి తహశీల్దార్ పురుషోత్తమ్ముడు,ఎంపీడీఓ రాణెమ్మ,ఎఓ. మల్లేష్ కుమార్,ఆర్డబ్లీవ్ఎస్ ఎఈ. గోనెనాయక్, పిఆర్ఎఇ. ప్రకాష్, హౌసింగ్ ఎఇ. సుమంత్, ఉపాధిహామీ ఏపీఓ. రామన్న, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆనందపురం బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి

**పాములపాడు మేజర్ న్యూస్ :** పాములపాడు మండల పరిధిలోని జూటూరు మజారా గ్రామమైన కోల్స్ ఆనందపురం బ్రిడ్జిని నిర్మించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు లింగాల నాగరాజుఅన్నారు.సోమవారం పాములపాడు తహశీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుకినాలపై బ్రిడ్జి బ్రిటిష్ కాలం నాటిదని ఆ బ్రిడ్జి శిథిలావస్థలకు చేరిందని పెద్ద వర్షాలు పడితే కూలిపోయే ప్రమాదం ఉందని అన్నారు ఈ బ్రిడ్జిపై రైతు కూలీలు జూటూరు ఆనందపురం వ్యవసాయ పనుల నిమిత్తం వ్యవసాయ కూలీలు రైతులు తిరుగుతుంటారని గుర్తు చేశారు గత వైసిపి ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పి మాట తప్పిందని అన్నారు ప్రభుత్వం వెంటనే నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరారు.

## గిద్దలూరు ఉప ఎన్నిక ఏకగ్రీవం

**సంజామలమేజర్,న్యూస్ః**

సంజామల మండల పరిధిలోని గిద్దలూరు గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్‌గా తలారి సుబ్బన్నను వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఈఒపిఆర్డీ రాధికారెడ్డి సోమవారం తెలిపారు. ఉప సర్పంచ్‌గా ఉన్న బి. సులోచన రాజీనామ చేయడంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నికలు నిర్వహించి తలారి సుబ్బన్నను ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. 7మంది వార్డు సభ్యులు, సర్పంచ్ మద్దతు ఇవ్వడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఈ మేరకు ప్రొసిడింగ్ అధికారి రాధికారెడ్డి ఉప సర్పంచ్ ఎన్నికైన వైకాపా నాయకుడు తలారి సుబ్బన్నకు ఎన్నిక ధృవపత్రాన్ని అందించారు.

# ఫిర్యాదులపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తాం

**– జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం నగరంలోని టుటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి మొత్తం 128 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై స్పందించి సమస్యలు పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల్లో కొన్ని ఓర్వకల్లు మండలం కన్నమడకల గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యాపారి 95షేర్ల నకిలీ ఉల్లి విత్తనాలు ఇచ్చి పలువురు రైతులను మోసం చేశాడని, కడప జిల్లా పెండ్లిమర్రి గ్రామానికి చెందిన నాగమల్లారెడ్డి ఫిర్యాదు చేశారు. ఇల్లు కట్టిస్తామని చెప్పి ఒక వ్యక్తి అడ్వాన్సుగా డబ్బులు తీసుకొని ఇంతవరకు ఇల్లు కట్టించకుండ మోసం చేస్తున్నాడని గూడూరుకు చెందిన యుగంధర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐలు పాల్గొన్నారు.

# ల్యాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

**–జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా**



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందచేస్తున్న కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతి నిధి :** ల్యాప్‌టాప్‌లను సద్విని యోగం చేసుకుని నైపుణ్యాలు పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా విద్యార్థులకు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సున యన ఆడిటోరియంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన ల్యాప్‌టాప్‌లను ఇద్దరు విద్యార్థినీలకు కలెక్టర్ అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాలిటెక్నిక్, డిగ్రీ తదితర ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లను అందచేయడం జరుగుతోందన్నారు. విద్యార్థులు ల్యాప్‌టాప్‌లు వినియోగించుకుని నైపుణ్యం సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా పాల్గొన్నారు.

# మానవతాదృక్పథంతో సమస్యలను పరిష్కరించండి



ప్రజా వేదికలో వృద్దుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను మానవతా దృక్పథంలో ఆలోచించి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డిఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను మానవతా దృక్పథంతో ఆలోచించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలు నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే విధంగా చేస్తే సమస్య పరిష్కారం అవుతుందో ఆలోచించాలన్నారు. స్వీకరించిన ప్రతి సమస్యకు ఖచ్చితమైన పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంకా ఈకార్యక్రమంలో 213మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.

# ఉమామహేశ్వరులకు పల్లకీ సేవ



పల్లకి సేవ దృశ్యం

**బనగానపల్లెరూరల్,న్యూస్:** ఎర్రమల్ల కొండల్లో వెలిసిన ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానం నందు సోమవారం సందర్భంగా స్వామి అమ్మవార్లకు పల్లకి సేవ నిర్వహించడం జరిగింది. స్వామి వారు ఉత్సవ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో అలంకరించి పల్లకిలో కూర్చొబెట్టి ప్రధాన ఆలయం చుట్టూ పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరెడ్డి దంపతులు , బండి మౌళీశ్వర రెడ్డి, ఆలయ ఈ.ఓ చంద్రుడు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కార్యకర్తల కృషి ఫలితమే కూటమి ప్రభుత్వం విజయం

- కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం
- కడపలో జరిగే మహానాడును విజయవంతం చేద్దాం
- శ్రీశైలం నియోజకవర్గం మహానాడులో ఎమ్మెల్యే బుడ్డా



మహానాడు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** కార్యకర్తలు చేసిన కృషి ఫలితమే కూటమి ప్రభుత్వ విజయమని, కష్టపడి పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని శ్రీశైలం నియోజకవర్గం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం శ్రీశైలం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుడ్డా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారకరామారావు అడుగు జాడల్లో నడుస్తు 43 సంవత్సరాలుగా పార్టీ కోసం కార్యకర్తలు చేస్తున్న సేవలు మరువలేనివని అన్నారు. కార్యకర్తల సంక్షేమాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని, ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గౌరవాన్ని ఇస్తు సముచిత స్థానం కల్పిస్తున్నామని అన్నారు. కార్యకర్తల బలంతోనే ప్రభుత్వం పార్టీ బలోపేతం , అభివృద్ధి సంక్షేమం రెండుకళ్లుగా ముందుకు సాగుతుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల్లోనే అనేక అభివృద్ధి పనులు చేశామని అన్నారు. ప్రధానంగా శ్రీశైలం నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. కష్టపడి చేసిన కార్యకర్తలకు, నాయకులకు పార్టీ నామినేటెడ్ పదవుల్లో చోటు కల్పిస్తున్నామని అన్నారు నూతన మండల పార్టీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు బాధ్యతాయుతంగా పార్టీ కోసం పనిచేయాలన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. ఈనెల 27,28,29 తేదిల్లో కపడలో జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి భారిగా తరలివెళ్ళి విజయవంతం చేయాలని, ఇది ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడిన ప్రతి కార్యకర్తకు టీడీపీ ప్రభుత్వం న్యాయం చేస్తుంది



మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** పార్టీ కోసం కష్టపడి ప్రతి ఒక్క కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు.ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గ మహానాడు కార్యక్రమం జరిగింది. మహానాడు కార్యక్రమానికి ఆళ్లగడ్డ తాలూకా ఆరు మండలాల కన్వీనర్లు, భూమా కార్యకర్తలు, టిడిపి అభిమానులు భారీగా తరలి ంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడు తూ గత వైసిపి ప్రభుత్వం లో ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఈరోజు ప్రభుత్వం వచ్చిందని చాలామంది సంతోషపడుతున్నారన్నారు. కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు కచ్చితంగా టీడీపీ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు.తాలూకాలో సమస్యల కోసం గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి కచ్చితంగా పనులు అయ్యేలాగా చూస్తామన్నారు.వైసిపి ప్రభుత్వం లో లాగా కాకుండా ప్రతి ఒక్క కార్యకర్తకు ప్రజలకు న్యాయం జరిగేలాగా చూస్తామన్నారు.వైసిపి నాయకులు చాలాసార్లు మాకు రాయబారం పంపారని 60% 40% తీసుకుందాం పనులు చేసుకోని అని కానీ మేము ఏరోజు కూడా వారు చెప్పిన మాటలకు సమాధానం ఇవ్వలేదన్నారు.ఈ గెలుపు నాది కాదు ప్రజల గెలుపు అని తెలియజేస్తున్నానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భూమా అభిమానులు పాల్గొన్నారు.

# గన్‌మెన్‌లను కేటాయించాలని ఎస్పీకి వినతి

**– మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి**

**కర్నూలు క్రైం, ప్రభాతవార్త :** పదవిలో ఉండగా ఉన్న గన్‌మెన్‌లను ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత గన్‌మెన్‌లను తగ్గించడం వల్ల తనకు ప్రత్యేకంగా గన్‌మెన్‌లను కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కోరారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కలిసి వినతిప్రతం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అదనంగా ప్రభుత్వం తరుపున నుంచి గన్‌మెన్‌లను కేటాయించాలన్నారు. అధికార పార్టీ వారి నుండి తనకు ప్రాణ హాని ఉందని ప్రజల్లోకి వెళుతున్న సమయంలో తనకు ఇబ్బందిగా మారిందని తనకు అదనపు గన్‌మెన్‌లను కేటాయించాలని ఆయన కోరారు. స్పందించిన ఎస్పీ ప్రభుత్వానికి నివేదికను పంపుతామని తెలిపినట్లు సమాచారం.

# విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తాం

**– పోలీస్ పరిష్కార వేధికకు 67 ఫిర్యాదులు**

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల బొమ్మలసత్రం పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేధిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎం యుగంధర్‌బాబు ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి 67 వినతులు అందినట్లు తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను పూర్తిస్థాయిలో విచారించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. చట్టపరిధిలో ఉన్న వాటికి తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు మళ్లీ పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అన్నారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ గౌతమి, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు